

సముద్రంలో ఇండ్లు!

- బ్రిటన్ స్టార్టప్ 'డీప్' పరిశోధనలు
- 2035 నాటికి మానవుల నివాస స్థానంగా సముద్ర గర్భం
- 2050 నాటికి మానవ జననాలు నీటి అడుగున ఉన్న ఇండ్లలోనే!

లండన్: బ్రిటన్‌లోని స్టార్టప్ కంపెనీ డీప్ (డీఈఈపీ) సముద్ర గర్భాన్ని మానవ ఆవాసంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక అన్వేషణ, పరిశోధనలకు, మానవుల జీవనానికి సముద్రం చాలా ముఖ్యమైనదవుతుందని చెప్తున్నది. 2050నాటికి మానవ జననాలు సముద్ర గర్భ ఇండ్లలో సాధ్యమయ్యేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఇటీవల ఓ బయోమెడికల్ ఇంజినీరు 100 రోజులపాటు సముద్ర గర్భంలో జీవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగంతో డీప్ అంతర్జాతీయంగా చర్చకు తెర తీసింది. సముద్రం లోపలి నియంత్రిత వాతావరణంలో ఈ ప్రయోగం జరిగింది. సముద్రం లోపలి భాగంలో మానవులు జీవించగలరా? పని చేసుకోగలరా? తమ కుటుంబాలతో సహా నివసించగలరా? అనే ప్రశ్నలను ఈ ప్రయోగం మరోసారి లేవనెత్తింది.

సాకారమయ్యేనా?

డీప్ అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ, నీటి అడుగున జీవించడమనేది ఇక ఎంత మాత్రం సైన్స్-ఫై డ్రీమ్ కాదన్నారు. సవాళ్లకు తగినట్లుగా సర్దుబాటు చేసుకోగలిగితే, సముద్రాన్ని తమ ఇంటిగా పిలవకపోవడానికి ఎటువంటి కారణం మానవులకు ఉండదని తెలిపారు. ఈ కంపెనీ ఈ ఏడాదిలో వాన్‌గార్డ్ అనే త్రీడీ ప్రింటెడ్ ప్రెజరైజ్డ్ మెటల్ హ్యాబిటాట్‌ను ఆవిష్కరించబోతున్నది. సముద్ర ఉపరితలం నుంచి 325 అడుగుల లోతు వరకు ఉండే పరిస్థితులను తట్టుకునే విధంగా ఇది ఉంటుంది. సముద్ర ఉపరితలం నుంచి 200 మీటర్లు లేదా 656 అడుగుల లోతు వరకు సూర్యకాంతి చొచ్చుకెళ్లగలదు. ఇది విజయవంతమైతే ఈ కంపెనీ తొలి ప్రధాన మైలురాయిని సాధించినట్లే. దీని వైశాల్యం 300 చదరపు అడుగులు మాత్రమే. ముగ్గురు డైవర్లు, స్వల్పకాలిక సైంటిఫిక్ మిషన్స్ దీనిలో ఉంటాయి. వాన్‌గార్డ్ తర్వాత సెంటినెల్స్ అనే విశాలమైన నివాస ప్రదేశాలను నిర్మించాలని ఈ సంస్థ ప్రణాళికలు రచించింది. సముద్ర ఉపరితలం నుంచి 656 అడుగుల లోతులో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటిలో ఆరు పడక గదులు, వంట గది, స్నానాలు, మరుగుదొడ్ల సదుపాయాలు; పరిశోధనలు చేయడానికి ప్రయోగశాలలు ఉంటాయి. భూమి మీద ఉండే ఇండ్ల మాదిరిగానే ఇవి కూడా పని చేస్తాయని ఈ కంపెనీ భావిస్తున్నది. 2035నాటికి ప్రపంచంలో 10 భారీ సముద్ర గర్భ ఆవాసాలను నిర్మించాలని రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. 2050నాటికి ప్రెజరైజ్డ్, ఆక్వాటిక్ వాతావరణంలో ఉన్న ఇంటిలో మానవ జననం జరగాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దశాబ్దాల కిందటి ఆలోచన..

ఇదిలావుండగా, సముద్ర గర్భంలో మానవ ఆవాసాల నిర్మాణం గురించిన ఆలోచన 1950, 1960 దశకాల్లో కూడా వచ్చింది. అమెరికా నావికా దళానికి చెందిన సీల్యాబ్, ఫ్రెంచ్ ఓషనోగ్రాఫర్ జాక్వెస్ కోస్ట్యూకు చెందిన కోన్‌షెల్ ప్రాజెక్టులు కొంత వరకు ప్రయత్నించాయి. అయితే ఇవి 28 రోజుల వరకు పరిమితమయ్యాయి. లాజిస్టికల్ ఇబ్బందులు, విపరీతమైన ఖర్చులు, సాంకేతిక సమస్యల వల్ల ఈ ప్రాజెక్టులు అటకెక్కాయి. డీప్ మళ్లీ ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నది. కృత్రిమ మేధ, మానవుడి శరీరం గురించి మరింత అవగాహన వంటి వాటివల్ల తన లక్ష్యం నెరవేరుతుందని చెప్తున్నది.

మేం చైనీయులం.. మేం బెదరం!

- కవ్వింపులకు భయపడబోం
- టారిఫ్‌లపై తలొగ్గేది లేదు
- అమెరికాకు చైనా హెచ్చరిక
- ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చేందుకు మిత్ర దేశాలతో సంప్రదింపులు

బీజింగ్, ఏప్రిల్ 10: అమెరికాతో వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో కవ్వింపులకు తాము భయపడబోమని, తాము వెనుకడుగు వేయబోమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ప్రకటించారు. 'మేము చైనీయులం. కవ్వింపులకు మేము బెదరం. మేము వెనక్కు తగ్గం' అని నింగ్ స్పష్టంచేశారు. 1953లో అమెరికాతో యుద్ధం సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు మావో జెడాంగ్‌కు సంబంధించిన వీడియోను మావో నింగ్ ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో నిర్ణయించేది మేం కాదు. అమెరికా అధ్యక్షులు ట్రూమన్, ఫిసెన్‌హోవర్ లేదా తదుపరి అమెరికా అధ్యక్షుడిపై ఆధారపడి ఉంటుంది. ఈ యుద్ధం ఎంత కాలం కొనసాగినా మేం మాత్రం లొంగేది లేదు. సంపూర్ణ విజయం దక్కే వరకు పోరాడుతాం' అని మావో ఆ వీడియోలో పేర్కొన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం చైనాపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా ఏప్రిల్ 10వ తేదీ నుంచి అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలను 34 శాతం నుంచి 84 శాతానికి పెంచుతున్నట్టు చైనా ప్రకటించింది. దీనికి ప్రతిగా చైనా వస్తువులపై అమెరికా సుంకాలను 145 శాతం పెంచింది.

ఇతర దేశాలతో చైనా సంప్రదింపులు

ప్రతీకార సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనను ఉపసంహరించుకునేలా సమైక్య ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఇతర దేశాలతో చైనా సంప్రదింపులు జరుపుతోంది. అయితే ట్రంప్‌తో వాణిజ్య యుద్ధానికి జంకుతున్న చాలా దేశాలు చైనాతో జతకట్టేందుకు ముందుకు రావడం లేదు. ప్రపంచ మార్కెట్ల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న ట్రంప్ తాను విధించిన ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అయితే చైనాకు మాత్రం ఇందులో మినహాయింపు ఇవ్వలేదు. అయితే అమెరికాతో తాము చేస్తున్న న్యాయమైన పోరాటానికి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రజల మద్దతును అమెరికా గెలుచుకోలేదని, చివరకు ఆ దేశానికి ఓటమి ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో చైనా ప్రధాని లీ జియాంగ్ ఫోన్ ద్వారా చర్చలు జరిపిన నేపథ్యంలో ప్రపంచ దేశాల నాయకుల మద్దతు కూడగట్టగలమని చైనా ఆశిస్తోంది. ఇదిలా ఉండగా అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు ప్రతిచర్యగా అమెరికన్ సినిమాల దిగుమతిపై చైనా కోత విధించడంతోపాటు బెదిరింపులు మాని న్యాయ సమ్మతమైన చర్చలకు ముందుకు రావాలని అమెరికాకు పిలుపునిచ్చింది. ట్రంప్ చర్యల వల్ల అమెరికన్ సినిమాలపై చైనా ప్రేక్షకులకు ఉన్న సదభిప్రాయం పూర్తిగా అంతమయ్యే ప్రమాదం ఉందని చైనా ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే చైనా చలనచిత్ర పాలనా యంత్రాంగం తెలిపింది.

అమెరికన్లకు ప్రత్యేక 'పన్ను వడ్డింపు'!

ఓ చైనా రెస్టారెంట్ వినూత్న ప్రతిఘటన

గువాంగ్‌జౌ(చైనా), ఏప్రిల్ 10: అమెరికాను దెబ్బకు దెబ్బ తీయాలన్న చైనా ప్రభుత్వ నిర్ణయాన్ని చైనా ప్రజలు కూడా బలపరుస్తున్నారు. అమెరికా భారీ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవాలని చైనా ప్రభుత్వం ఓ పక్క తహతహలాడుతుండగా తాము కూడా తగ్గేదేలే అంటూ ఓ చైనీస్ రెస్టారెంట్ ఏకంగా అమెరికన్ కస్టమర్లనే టార్గెట్ చేసింది. తమ రెస్టారెంట్‌ను సందర్శించే అమెరికన్ కస్టమర్లపై భారీ సర్వీసు చార్జీలను ప్రకటించింది. "నేటి నుంచి మా రెస్టారెంట్‌లో అమెరికన్ కస్టమర్లకు 104 శాతం సర్వీసు చార్జీ ఉంటుంది. మీకేమైనా ప్రశ్నలు ఉంటే అమెరికన్ ఎంబసీని సంప్రదించవచ్చు" అంటూ ఆ రెస్టారెంట్ యాజమాన్యం గేటు బయటే నోటీసు బోర్డు పెట్టింది. ఈ చర్య స్థానిక ప్రజలను సంతోష పెడుతుండగా అమెరికన్ పౌరులను మాత్రం ఇరకాటంలో పడేసింది. అమెరికా, చైనా మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలకు ఇదే నిదర్శనమని చెప్పవచ్చు. చైనా దిగుమతులపై సుంకాలను 104 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కారోలిన్ లీవిట్ మంగళవారం ప్రకటించిన దరిమిలా చైనాలోని రెస్టారెంట్ కూడా అంతే మొత్తంలో అమెరికన్ కస్టమర్లకు సర్వీసు చార్జీ వడ్డించడం విశేషం.



యూదు వ్యతిరేక పోస్ట్‌లు పెడితే

వీసా రద్దు

వాషింగ్టన్: తమ దేశంలో ఉంటూ సామాజిక మాధ్యమాల్లో యూదు వ్యతిరేక పోస్ట్‌లు పెట్టిన వారి వీసాలను, గ్రీన్ కార్డులను రద్దు చేస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించింది. కొత్తవి మంజూరు చేయబోమని స్పష్టంచేసింది. తమ ప్రభుత్వం ఉగ్రవాద సంస్థలుగా గుర్తించిన హమాస్, హెజ్బొల్లా, హౌతీ తదితర సంస్థలను సమర్థించిన వారికీ తాజా హెచ్చరికలు వర్తిస్తాయని తెలిపింది. 'మా దేశానికి వచ్చి యూదు వ్యతిరేక హింసకు, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వాలనుకొనేవారు మరోసారి ఆలోచించుకోండి. మీకు మేం ఇక్కడ స్వాగతం పలకం' అని హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ అన్నారు. తాజా నిబంధనలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

విమానం ల్యాండ్ అయిన వెంటనే పైలట్ మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన యువ పైలట్(30) గుండెపోటుతో అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయారు. బుధవారం మధ్యాహ్నం శ్రీనగర్ నుంచి ఢిల్లీకి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాన్ని నడిపిన సదరు పైలట్, ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న కొద్ది నిమిషాల్లోనే మరణించటం కలకలం రేపింది. విమానాన్ని ఢిల్లీ విమానాశ్రయంలో దింపే సమయానికి పైలట్ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, వెంటనే అతడ్ని దవాఖానకు తీసుకుపోయినప్పటికీ.. ఆయన ప్రాణాలు నిలువలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'ఎంతో విలువైన సహ ఉద్యోగిని కోల్పోయినందుకు మేం ఎంతగానో చింతిస్తున్నాం. ఆయన కుటుంబ సభ్యులకు సాధ్యమైనంత సాయం అందిస్తాం' అని ఎయిర్‌లైన్స్ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్‌కు చేరుకున్న తహవ్వుర్ రాణా

- 26/11 ముంబై పేలుళ్ల కేసులో ప్రధాన సూత్రధారి
- ప్రత్యేక విమానంలో యూఎస్ నుంచి ఢిల్లీకి
- వెంటనే అధికారికంగా అరెస్ట్‌చేసిన ఎన్ఐఏ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ముంబై 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు విజయవంతంగా తీసుకువచ్చారు. అమెరికా నుంచి అతడిని తీసుకువచ్చిన ప్రత్యేక విమానం గురువారం సాయంత్రం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంది. వెంటనే అతడిని నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారికంగా అరెస్ట్ చేసి న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేసింది. ప్రస్తుతం అమెరికాలోని జైలులో శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ సంతతికి చెందిన 64 ఏండ్ల కెనడా పౌరుడు రాణాను ఆ దేశం అధికారికంగా భారత్‌కు అప్పగించడంతో ఎన్ఐఏ, నేషనల్ సెక్యూరిటీ గార్డుల రక్షణలో గురువారం అతడిని భారత్‌కు తీసుకువచ్చినట్టు అధికారులు ప్రకటించారు. 166 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ముంబై పేలుళ్ల కేసులో రాణా ప్రధాన నిందితుడు. ఈ సందర్భంగా సీజీవో కాంప్లెక్స్‌లోని ఎన్ఐఏ హెడ్‌క్వార్టర్స్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల రోడ్లపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రాణాను పటియాలా హౌస్‌కోర్టులో హాజరు పర్చేందుకు ఏర్పాట్లు చేశారు. రాణా ఢిల్లీలో దిగిన వెంటనే కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని మీడియా ప్రతినిధులను పోలీసులు ఆదేశించారు. ఎన్ఐఏ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ అడ్వకేట్ దయాన్ కృష్ణన్, ప్రత్యేక ప్రాసిక్యూటర్ నరేంద్ర మన్‌లు కోర్టు వద్దకు చేరుకున్నారు. స్పెషల్ ఎన్ఐఏ జడ్జి చందర్ జిత్ సింగ్ కేసును విచారించనుండగా, రాణా తరఫున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ ప్రతినిధి అయిన న్యాయవాది పీయూష్ సచ్‌దేవ్ వాదించనున్నారు.

రాణా మా దేశస్థుడు కాదు: పాక్

జన్మతః పాకిస్థాన్‌కు చెందిన రాణా తమ దేశ పౌరుడు కాదని బుకాయించేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ముంబై పేలుళ్ల కేసు నిందితుడితో తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. 1961లో పాకిస్థాన్‌లో జన్మించిన రాణా కెనడాకు వెళ్లక ముందు పాకిస్థాన్ ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో పనిచేశాడు.

హత్యకు ముందే నిందితుడిని

గుర్తించే ఏఐ టూల్

బ్రిటన్ ప్రభుత్వం ప్రయోగాలు

లండన్: బ్రిటన్ ప్రభుత్వం మర్డర్ ప్రిడిక్షన్ ప్రోగ్రామ్‌ను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నది. హింసాత్మక నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నవారిని ముందుగానే గుర్తించేందుకు కృత్రిమ మేధతో దీనిని రూపొందించేందుకు కృషి చేస్తున్నది. ఇది ప్రజా భద్రతకు ప్రయోజనకరమని చెప్తున్నప్పటికీ, విమర్శకులు మాత్రం ఇది భయానకమని ఆరోపిస్తున్నారు. సమాచార స్వేచ్ఛ చట్టం ప్రకారం స్టేట్‌వాచ్ సంస్థ ఈ ప్రాజెక్టు వివరాలను సేకరించింది. హత్యకు పాల్పడే ముప్పును పెంచే నేరగాళ్ల లక్షణాలను సమీక్షించవచ్చునని బ్రిటన్ న్యాయ శాఖ ఆశిస్తున్నది. ఈ సమీక్ష అనంతరం ఈ రిస్కును అంచనా వేయడానికి ప్రత్యామ్నాయ, ఇన్నోవేటివ్ డాటా సైన్స్ టెక్నిక్స్‌ను అన్వేషించవచ్చునని చెప్తున్నది.

కేఎఫ్‌సీ టూత్‌పేస్ట్!

న్యూఢిల్లీ: కేఎఫ్‌సీ ఫ్రైడ్ చికెన్ గురించి విన్నాం.. ఈ కేఎఫ్‌సీ టూత్‌పేస్ట్ ఏంటి అనుకుంటున్నారా? మీరు విన్నది నిజమే. ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్ చైన్ కేఎఫ్‌సీ ఆస్ట్రేలియన్ డెంటల్ కేర్ కంపెనీ హిస్మైల్‌తో కలిసి ఫ్రైడ్ చికెన్ ఫ్లేవర్‌తో ఓ టూత్‌పేస్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్వల్ప కాలంపాటు మాత్రమే అందుబాటులో ఉండే ఈ టూత్‌పేస్ట్ అమ్మకాలు పూర్తయిపోయాయి. 11 హెర్బ్స్ అండ్ స్పైసెస్ ప్రేరణతో దీనిని తయారు చేశారు. ఈ రెండు కంపెనీలు ఇచ్చిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, 'ఇది ప్రాంక్ కాదు. ఇదిగో, ఇది అత్యంత రుచికరమైనది' అని పేర్కొన్నాయి. ఈ టూత్‌పేస్ట్ ధర రూ.1,123. దీనిని హిస్మైల్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే కొనవచ్చు. మంగళవారం వీటి అమ్మకాలు పూర్తయ్యాయి. కేఎఫ్‌సీ టూత్‌బ్రష్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ధర సుమారు రూ.5,097.

ఏఐ సాయంతో కృత్రిమ గర్భ ధారణ

ప్రపంచంలో తొలి శిశు జననం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీ వైద్య రంగంలోనూ సంచలనంగా మారింది. ఐవీఎఫ్ (కృత్రిమ గర్భధారణ)లో ఏఐ సాయంతో ప్రపంచంలోనే తొలి శిశువు జననం మెక్సికోలో జరిగింది. న్యూయార్క్, మెక్సికో వైద్యుల బృందం చేపట్టిన పూర్తి ఆటోమేటెడ్ ఐవీఎఫ్ విధానంతో 40 ఏండ్ల మహిళ ఇక్కడి ఓ దవాఖానలో మగ శిశువుకు జన్మనిచ్చింది. శుక్ర కణాన్ని నేరుగా అండంలోకి ఇంజెక్ట్ చేయటమన్నది (ఐసీఎస్ఐ) ఐవీఎఫ్‌లో సర్వసాధారణమైన ప్రక్రియ. నిపుణులైన (ఎంబ్రాయలజిస్ట్) వారితో ఐసీఎస్ఐను చేపడతారు. దీంట్లో ఉండే 23 దశలను మానవ ప్రమేయం లేకుండా ఏఐ సాయంతో వైద్య బృందం పూర్తి చేయటం ఓ సంచలనం. వైద్యులు తయారుచేసిన నూతన పద్ధతిలో పూర్తిస్థాయి ఆటోమేటెడ్ ఐవీఎఫ్ విధానంలో సంతానోత్పత్తి ప్రపంచంలోనే తొలిసారి. దీంతో 1990 నుంచి వైద్యులు ఉపయోగిస్తున్న ఐసీఎస్ఐ సాధారణ ప్రక్రియకు నూతన పద్ధతి ప్రత్యామ్నాయంగా మారనున్నది. శుక్ర కణాల ఎంపిక, అండంలోకి ఇంజెక్ట్ చేయటం, ఫలదీకరణం సహా అనేక ప్రక్రియలను ఏఐ సాయంతో ఆటోమేటెడ్ పద్ధతిలో పూర్తిచేయటం కొత్త పద్ధతిలోని ముఖ్యాంశం.

ప్రసూతి మరణాల్లో భారత్‌కు రెండో స్థానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రసూతి మరణాలలో భారత్ 2023లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో 2023లో సగటున ప్రతిరోజు 52 చొప్పున మొత్తం 19 వేల ప్రసూతి మరణాలు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), యునిసెఫ్, యూఎన్ పాపులేషన్ ఫండ్ తదితర సంస్థలు ఈ నివేదికను విడుదల చేశాయి. 75 వేల మరణాలతో నైజీరియా మొదటి స్థానంలో ఉంది. ఈ విషయంలో పాకిస్థాన్ 11 వేల మరణాలతో చాలా మెరుగైన స్థితిలో ఉంది. యూఎన్ సంస్థలు తెలిపిన వివరాల ప్రకారం ఆ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నిమిషానికి సగటున 2.6 లక్షల మంది మహిళలు గర్భ, ప్రసవ సంబంధిత ఇబ్బందులు, వ్యాధులతో మరణించారు. కాగా, ఇటీవల నిలిపివేసిన యూఎస్ ఎయిడ్ మానవతా సహాయం వల్ల పలు దేశాల్లో ఆరోగ్య సేవలకు ఆటంకం ఏర్పడిందని యూఎన్ తన నివేదికలో తెలిపింది.

డీకే ఆఫీసులో విచ్చలవిడి అవినీతి

- బ్రోకర్లతో నిండిపోయిన డిప్యూటీ సీఎం కార్యాలయం
- అవినీతి చీడలో బీజేపీని మించిన కాంగ్రెస్ సర్కారు
- కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం సంచలన ఆరోపణలు

బెంగళూరు, ఏప్రిల్ 10: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మరో ఇద్దరు సీనియర్ మంత్రుల కార్యాలయాలలో అవినీతి విలయతాండవం చేస్తోందని కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం(కేఎస్‌సీఏ) గురువారం సంచలన ఆరోపణలు ఆరోపించింది. బీజేపీ అధికారంలో ఉన్నప్పటి కన్నా ఇప్పుడు అవినీతి చీడ మితిమీరి పోయిందని కేఎస్‌సీఏ వెల్లడించింది. శివకుమార్ కార్యాలయంలో బ్రోకర్లు కిక్కిరిసిపోయి ఉంటారని కేఎస్‌సీఏ అధ్యక్షుడు ఆర్ మంజునాథ్ తెలిపారు. మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్ఎస్ బోస్‌రాజు కుమారుడు రవి బోస్‌రాజు లావాదేవీలన్నీ తానే జరుపుతారని, ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి బంధువు ఒకరు శాఖాపరమైన వ్యవహారాలలో తలదూరుస్తాడని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలపై శివకుమార్ స్పందిస్తూ కాంట్రాక్టర్లు ఫిర్యాదు నమోదు చేయాలని కోరగా బోస్‌రాజు, సతీష్ వీటిని ఖండించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విధాన సౌధలో జరిగిన ఓ కార్యక్రమంలో ముడుపులు, దళారులకు వ్యతిరేకంగా మాట్లాడిన రోజే కేఎస్‌సీఏ ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. అవినీతిలో కర్ణాటక దేశంలోనే నంబర్ వన్ అంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు, కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజ్ రాయరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే ఏకంగా రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం సీనియర్ మంత్రులపై అవినీతి ఆరోపణలు గుప్పించడం రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది.

శరీరంలో బుల్లెట్‌ను ఇంప్లాంట్ చేసుకొని!

గ్యాంగ్‌రేప్ నాటకమాడి.. ▪ రాజకీయ నేతపై కక్షతో మహిళ కట్టుకథ

లక్నో: యూపీలోని బరేలీలో తనను అపహరించి, సామూహిక లైంగిక దాడి చేయడమే కాక, తనను తుపాకీతో కాల్చారంటూ 10 రోజుల క్రితం ఒక మహిళ చేసిన ఫిర్యాదు పూర్తిగా అబద్ధమని పోలీసులు తేల్చారు. ఒక రాజకీయ నాయకుడు, అతని కుమారుడిని కేసులో ఇరికించడానికే ఆమె ఈ ఆరోపణలు చేయడమే కాక, ఒక తుపాకి బుల్లెట్‌ను ఆపరేషన్ ద్వారా శరీరంలో ఇంప్లాంట్ చేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. మార్చి 10న తనను కొందరు అపహరించి, గ్యాంగ్ రేప్ చేయడమే కాక, తుపాకీతో కాల్చారని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసుల విచారణలో..తాను చెప్పినదంతా కట్టుకథేనని ఆమె ఒప్పుకుంది.

వ్యభిచార గృహాలతో సంబంధాలు..

భారత సంతతి సీఈవో అరెస్ట్

వాషింగ్టన్, ఏప్రిల్ 10: భారత సంతతికి చెందిన క్లీన్ వాటర్ స్టార్టప్ సీఈవో అనురాగ్ బాజ్‌పేయిని అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికాలో ఉన్నతస్థాయి వ్యభిచార గృహాలతో సంబంధాలు పెట్టుకున్నట్టు ఆయనపై కేసు దాఖలు చేసిన అధికారులు ఆరోపించారు. వ్యభిచార గృహాలలో గంటల లెక్కన లైంగిక సేవలు పొందడానికి నమోదైన ఖరీదైన వ్యక్తుల జాబితాలో బాజ్‌పేయి ఒకరని న్యూయార్క్ పోస్ట్ కథనం పేర్కొంది. బాజ్‌పేయి.. లాయర్లు, ఉన్నతాధికారులు, డాక్టర్లు, ప్రభుత్వ కాంట్రాక్టర్లతో ఉన్న ప్రత్యేక ఖాతాదారుల గ్రూప్‌నకు చెందిన వారని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈయన మహిళలతో, ముఖ్యంగా ఆసియాకు చెందిన వారితో గడపడానికి గంటకు 600 డాలర్లు (సుమారు రూ.50 వేలు) చెల్లించేవారని, ఆ మహిళల్లో చాలామంది మానవ అక్రమ రవాణాకు గురైన వారని అధికారులు తెలిపారు.

ఆమే సమస్యను కొని తెచ్చుకుంది!

రేప్ బాధితురాలిపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు

అలహాబాద్: వక్షోజాలను పట్టుకోవడం, పైజామా తాడును లాగడాన్ని అత్యాచారంగా పరిగణించలేమని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు తీర్పు చెప్పి మూడు వారాలు కూడా గడవక ముందే అదే హైకోర్టుకు చెందిన మరో న్యాయమూర్తి కూడా అదే తరహా తీర్పునిచ్చారు. అత్యాచారం కేసును విచారిస్తూ.. బాధితురాలే సమస్యను కోరి కొనితెచ్చుకుందని, ఇందులో ఆమెకు కూడా సమాన బాధ్యత ఉందంటూ వ్యాఖ్యానించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీలోని హౌజ్ ఖాస్‌లోని ఓ బార్‌లో కలుసుకున్న ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ తన ఉత్తర్వులో ఈ వ్యాఖ్యలు చేశారు. నిందితుడు నిశ్చల్ చందక్‌పై నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం బాధితురాలు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థిని. నోయిడాలోని ఓ లేడీస్ హాస్టల్‌లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటోంది. గత ఏడాది సెప్టెంబర్ 21న ఆమె తన ముగ్గురు స్నేహితురాళ్లతో కలసి హౌజ్ ఖాస్‌లోని ఓ బార్‌కు వెళ్లింది. తెల్లవారుజాము 3 గంటల వరకు వారు మద్యం సేవించారు. బాగా మత్తెక్కిపోవడంతో తన హాస్టల్‌కి వెళ్లడానికి ఆమెకు తోడు అవసరమైంది. అక్కడే ఆమెకు నిశ్చల్ పరిచయమయ్యాడు. తన ఇంటికి తీసుకెళతానని చెప్పిన అతడు, ఆమెపై రెండు సార్లు అత్యాచారం చేశాడన్నది ఆరోపణ. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడి తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ బెయిల్ మంజూరు చేస్తూ, ఇద్దరూ పరస్పర అంగీకారంతో లైంగికంగా కలసినట్టు పరిగణించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

రుతుస్రావమైందని తరగతి బయట పరీక్ష!

తమిళనాడులో దళిత విద్యార్థినిపై అమానుషం

చెన్నై: తమిళనాడు కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థినికి రుతుస్రావం కావడంతో, స్కూల్ ప్రిన్సిపల్ ఆ అమ్మాయిని తరగతి గది బయట కూర్చొబెట్టి పరీక్ష రాయించారు. బాధితురాలు ఎనిమిదో తరగతి చదువుతున్న దళిత విద్యార్థిని. ఈ అమానుష ఘటనపై ప్రాథమిక విచారణ అనంతరం విద్యాశాఖ సదరు స్కూల్ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసింది. ఘటనకు సంబంధించిన వీడియో ప్రకారం.. బాధితురాలు తనను ప్రిన్సిపల్ ఇలా క్లాస్‌రూమ్ బయట గతంలోనూ పరీక్ష రాయించారని తన తల్లితో చెప్పింది. ఘటనపై తమిళనాడు విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ స్పందిస్తూ.. పిల్లలపై అణచివేతను సహించమని చెప్పారు.

న్యూక్లియర్ గ్రావిటీ బాంబ్!

- అభివృద్ధి చేస్తున్న అమెరికా
- హిరోషిమా అణుబాంబు కంటే 24 రెట్లు పవర్‌ఫుల్

వాషింగ్టన్, ఏప్రిల్ 10: పాత అణ్వాయుధాల స్థానంలో ప్రవేశపెట్టదలచిన 'న్యూక్లియర్ గ్రావిటీ బాంబ్' అభివృద్ధిని అమెరికా వేగవంతం చేసింది. భారీ విధ్వంసాన్ని కలుగజేసే ఈ అణు గురుత్వాకర్షణ శక్తి బాంబ్ ఉత్పత్తిని 2026లో ప్రారంభించి 2028 నాటికి వాటిని అణ్వాయుధాల స్థానంలో వైమానిక దళానికి ఇవ్వాలని ప్రయత్నిస్తున్నది. హిరోషియాపై వేసిన అణుబాంబ్ కన్నా ఇది 24 రెట్లు అధిక శక్తిమంతమైనది. ఒక్క గ్రావిటీ బాంబును బీజింగ్ వంటి నగరంపై వేస్తే 7,88,000 మంది మరణిస్తారని, 22 లక్షల మంది క్షతగాత్రులవుతారని నిపుణులు పేర్కొన్నారు. ఈ బాంబు పడిన అర మైలు పరిధిలో జీవులు, భవనాలు అన్నీ ఆవిరైపోతాయని, కిలోమీటరు పరిధిలో ఉన్నవన్నీ వెంటనే హతమవుతాయని తెలిపారు. రెండు మైళ్ల దూరం వరకూ ఈ బాంబు రేడియేషన్ ప్రభావం ఉంటుందని, ఆ పరిధిలోని జనం నెల రోజుల్లో మృత్యువాత పడతారని పేర్కొన్నారు. ఆ ప్రభావం నుంచి బయటపడిన వారిలో 15 శాతం మంది ఆ తరువాత క్యాన్సర్ బారిన పడి మరణిస్తారని తెలిపారు. తొలుత ఈ బాంబ్ తొలిదశ అభివృద్ధిని 2037లో ప్రారంభించి 2050 నాటికి ఉత్పత్తి చేయాలని జాతీయ అణు భద్రతా సంస్థ (ఎన్ఎన్ఎస్ఏ) భావించింది. కానీ ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా తన ప్రణాళికను ముందుకు జరిపింది. ప్రస్తుతం బీ61-13గా పిలిచే ఈ అణు గ్రావిటీ బాంబ్ ఉత్పత్తి న్యూమెక్సికోలోని సాండియా జాతీయ ల్యాబొరేటరీలో కొనసాగుతున్నది. అంతర్జాతీయంగా పలు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడం, చైనాతో అమెరికా సంబంధాలు ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో ఈ బాంబు ఉత్పత్తి వేగవంతం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం ఇరాన్, యెమెన్ దేశాలకు పాకిన నేపథ్యంలో అంతటా 3వ ప్రపంచ యుద్ధాన్ని గూర్చిన భయాందోళనలు నెలకొన్న సంగతి తెలిసిందే.

27 వేల మంది టెకీలపై వేటు

- ఈ ఏడాది ఇప్పటివరకు తొలగింపులు
- మున్ముందు మరింత పెరిగే అవకాశం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 100 కంపెనీలు 27 వేల మందికిపైగా ఉద్యోగులపై వేటు వేశాయి. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, అమెరికాలో మాంద్యం భయాలు, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

దిగ్గజ కంపెనీల్లోనూ ఉద్వాసనలు..

ఇటీవలి కాలంలో వర్డ్ ప్రెస్ డెవలపర్ ఆటోమేటిక్, జాక్ డార్సీకి చెందిన బ్లాక్, సిమెన్స్ లాంటి దిగ్గజ కంపెనీలు పలు కారణాలు చూపుతూ పెద్దయెత్తున ఉద్యోగులను తొలగించాయి. లేఆఫ్స్.ఎఫ్‌వై వెబ్‌సైట్ వివరాల ప్రకారం, 2025లో సాంకేతిక రంగంలో 100 కంపెనీలు 27,762 మంది ఉద్యోగులను తొలగించాయి. అంతకుముందు ఏడాది టెక్ రంగంలో 549 కంపెనీలు 1,52,472 మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ట్రంప్ అన్ని దేశాలపై టారిఫ్‌లను విధించడంతో ఈ సమస్య నుంచి బయటపడటానికి ఉద్యోగుల తొలగింపు ఒక్కటే మార్గంగా కంపెనీలు ఎంచుకుంటున్నాయి. లాభాలు, పెట్టుబడుల స్థాయిని పెంచుకోవడానికి ఇటీవల వర్డ్ ప్రెస్ డెవలపర్స్ తమ సంస్థలోని వివిధ శాఖలకు చెందిన 280 మంది (16 శాతం) ఉద్యోగులను తొలగించింది. ట్విట్టర్ సహ వ్యవస్థాపకులు జాక్ డోర్సేకు చెందిన బ్లాక్ 931 మంది ఉద్యోగులను తొలగించి వార్తల్లో నిలిచింది.